నేడు జిల్లా స్థాయి జూడో పోటీలు

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 22: కరీంనగర్‌లోని క్రీడా పాఠశాలలో సోమవారం ఉమ్మడి జిల్లా స్థాయి జూడో పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2011 తర్వాత జన్మించి, 6వ తరగతి ఆపై చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు బోనాఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డ్ జిరాక్స్ కాపీతో పోటీల కన్వీనర్ ఎల్‌వీ రమణ వద్ద సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు సెల్ నంబర్ 99485 32101లో సంప్రదించాలని పేర్కొన్నారు.

వసతి గృహం నుంచి విద్యార్థి అదృశ్యం

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 22: జగిత్యాల పట్టణంలోని ఖిలాగడ్డ మైనార్టీ రెసిడెన్షియల్ (బాయ్స్) వసతి గృహంలో 8వ తరగతి విద్యార్థి నిషార్ శనివారం సాయంత్రం అదృశ్యమయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. నిషార్ తోటి విద్యార్థులతో కలిసి శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆడుకోవడానికి స్కూల్ ఆవరణలోని ఖిలాగడ్డ గ్రౌండ్‌కు వెళ్లాడు. తిరిగి హాస్టల్‌కు వచ్చినప్పుడు నిషార్ మాత్రం కనిపించలేదు. దీంతో హాస్టల్ సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వెతికారు. రాత్రి పదిగంటల సమయంలో నిషార్ రాయికల్‌లోని తన ఇంటికి నడుచుకుంటూ వెళ్లాడు. కాగా, గ్రౌండ్ నుంచి తిరిగి హాస్టల్‌కు వెళ్తున్నప్పుడు వీధి కుక్కలు తరమడంతో భయపడి నడుచుకుంటు ఇంటి దారిపట్టినట్లు నిషార్ చెప్పాడు.

నర్సన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, సెప్టెంబర్ 22: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి చేరుకున్న భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శించుకొని పూజలు జరిపించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

గంజాయి పట్టివేత

పెగడపల్లి, సెప్టెంబర్ 22: పెగడపల్లి మండలం నామాపూర్ గ్రామ సమీపంలో 500 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు ఎస్‌ఐ రవికిరణ్ పేర్కొన్నారు. ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, రోడ్డుకు కొంత దూరంలో చెట్ల కింద రెండు ద్విచక్ర వాహనాలపై నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా, పట్టుకొని తనిఖీ చేయగా గంజాయి దొరికినట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి గంజాయి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు ధర్మపురి మండలం తిమ్మాపూర్‌కు చెందిన తోడేటి వెంకటేశం, బుగ్గారం మండలం సిరికొండకు చెందిన లింగాల వంశీ, చొప్పదండి మండలం భూపాలపల్లికి చెందిన గుండేటి ప్రవీణ్, ఆదిలాబాద్ జిల్లా ఊట్నూరుకు చెందిన పవన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

బహిరంగ సభకు తరలిరావాలి

మారుతీనగర్, సెప్టెంబర్ 22: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించే బహిరంగ సభకు డీలర్లు తరలిరావాలని రేషన్ డీలర్ల సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సభకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

మారుతీనగర్ : నరేందర్‌రెడ్డి గార్డెన్‌లో వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

రాయికల్ : పట్టణంలో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మారుతీనగర్/మెట్‌పల్లి రూరల్, సెప్టెంబర్ 22: పట్టణంలోని నరేందర్‌రెడ్డి గార్డెన్స్‌లో శ్రీ శ్రీనివాస గురుకుల విద్యాలయం 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, మెట్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 1978–79 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు స్థానిక వీఆర్‌ఎం గార్డెన్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించారు. మిత్రులంతా ఒకచోట కలిసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస గురుకుల విద్యాలయం విద్యార్థులు 'సేవే మార్గం–సేవే మా లక్ష్యం' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు మగ్గిడి వెంకటనర్సయ్య, పోహార్ హేమచందర్, దురిశెట్టి మనోహర్, రజియొద్దీన్, వెంకటరమణ, భూపాల్, మధుసూదన్, ఉమామహేశ్వర్, గోపీ, గౌతం తదితరులు పాల్గొన్నారు.

రాయికల్, సెప్టెంబర్ 22: పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. విద్యార్థులంతా ఒకచోట కలిసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి, శాలువాలతో సన్మానించారు.

మారుతీనగర్ : బీఆర్ఎం గార్డెన్‌లో వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

వేదికపై అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి, తదితరులు

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అల్ఫోర్స్‌లో అలరించిన స్వాగతోత్సవం

జగిత్యాల టౌన్, సెప్టెంబరు 22: జిల్లా కేంద్రంలోని వాసవీ గార్డెన్స్‌లో అల్ఫోర్స్ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. సరస్వతీమాత చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుల సంఘాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, సెప్టెంబరు 22: కుల సంఘాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం రెడ్డి జన సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీతో పాటు కరీంనగర్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ, రెడ్డి కులస్తుల్లో అనేక మంది పేదరికంలో బతుకుతున్నారని, వారిని ఆర్థికంగా ఆదుకోవడంలో ప్రభుత్వంతో పాటు మనందరిపై బాధ్యత ఉందన్నారు. రెడ్డి కుల విద్యార్థినులకు గర్ల్స్ హాస్టల్ ఏర్పాటు చేసి, ఉచితంగా విద్యనభ్యసించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. హాస్టల్ భవనానికి స్థలం చూడాలని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వెంకటరెడ్డిని ఆదేశించారు. మొదటగా తన వంతు సాయంగా గర్ల్స్ హాస్టల్ ఏర్పాటుకు ఎమ్మెల్సీ రూ. లక్ష సాయం ప్రకటించారు. కరీంనగర్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, రెడ్డి కులస్తుల్లో పేదలకు ఉన్నత స్థాయిలో ఉన్న వారు సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రెడ్డి జన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పెర వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి కిష్టంపేట రామచంద్రారెడ్డి, కోశాధికారి నేరెళ్ల భూమారెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారులు నరసింహారెడ్డి, మైపాల్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, వైద్యులు శైలేందర్‌రెడ్డి, సంఘం నాయకులు నంది తిరుపతి రెడ్డి, రవీందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

మల్లాపూర్, సెప్టెంబర్ 22: మల్లాపూర్ మండల ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బొడ్డు రాజేశ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే మెట్‌పల్లి, తదితర ప్రాంతాల నుంచి ఫైర్ ఇంజన్ వచ్చే సరికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. సంబదిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

రైతులకు రుణమాఫీ చేయాలి

మల్లాపూర్, సెప్టెంబర్ 22: గ్రామాల్లో పంట రుణ మాఫీ కానీ రైతులందరికీ త్వరగా అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కుస్తాపూర్ మాజీ సర్పంచ్ ద్యాగ గంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రేషన్‌కార్డులు లేని రైతులు ఇప్పటికే అధికారులకు దరఖాస్తులు అందజేసి, ఫొటోలు కూడా దిగినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతులందరికీ రుణమాఫీ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ హయాంలోనే పరిహారం మంజూరు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు సునీల్

వెల్గటూర్, సెప్టెంబర్ 22: ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన చెగ్యాం గ్రామానికి చెందిన 126 మంది నిర్వాసితులకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కృషితోనే రూ.18 కోట్ల పరిహారం మంజూరైనట్లు జీవో కూడా ఇచ్చినట్లు బీఆర్ఎస్ నాయకుడు రామిళ్ల సునీల్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ రావడంతో పరిహారం చెక్కులు పంపిణీ చేయలేదని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు జూపాక కుమార్, మాజీ సర్పంచులు మూగల సత్యం, ద్యావనపల్లి లక్ష్మి–ఎల్లయ్య, రామన్న, మేరుగు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వీడీసీ, యువజన సంఘాల మధ్య ముదిరిన వివాదం

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబర్ 22: మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ, యువజన సంఘాల మధ్య వివాదం ముదిరింది. డీజే సౌండ్‌పై వీడీసీ ఆంక్షలు విధించగా, బెల్టు దుకాణాలను ఎత్తివేయాలని యువజన సంఘాలు డిమాండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన వినాయక నిమజ్జనంలో డీజే సౌండ్ పెట్టుకోవడంపై గ్రామాభివృద్ధి కమిటీ, యువజన సంఘాల సభ్యుల మధ్య విభేదాలు నెలకొన్నాయి. వినాయక నిమజ్జనాన్ని రాత్రి 12 గంటల్లోగా పూర్తి చేయాలని, శోభాయాత్రలో డీజే సౌండ్ పెట్టుకోవద్దని జగ్గసాగర్ వీడీసీ తీర్మానించింది. ఈ నిర్ణయాన్ని ఎవరు ధిక్కరించినా రూ. 15 వేలు జరిమానా విధిస్తామని హుకుం జారీ చేశారు. కాగా, అప్పటికే యువజన సంఘాల సభ్యులు ముందస్తుగా డీజే నిర్వాహకులకు డబ్బులు చెల్లించడంతో డీజే పెట్టుకొని రాత్రి 12 గంటల్లోగా వినాయక నిమజ్జనం ముగించారు. ఈ విషయమై నాలుగు రోజుల క్రితం గ్రామంలో వీడీసీ సమావేశం నిర్వహించి, డీజే పెట్టిన యువజన సంఘాల సభ్యులను పిలిచి రూ. 15 వేలు జరిమానా చెల్లించాలని తేల్చిచెప్పారు. దీంతో విభేదించిన యువకులు గ్రామంలో బెల్టు దుకాణాలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ద్విచక్ర వాహనాలతో ర్యాలీ తీశారు. ఫలితంగా యువజన సంఘాలకు జరిమానా విషయంలో వీడీసీ సభ్యులు వెనక్కి తగ్గారు. దీంతో మరుసటి రోజు సమావేశమైన వీడీసీ ఈ వ్యవహారానికి ఓ వ్యక్తిని బాధ్యుడిగా చేస్తూ రూ. 50 వేలు చెల్లించాలని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో 'జగ్గసాగర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో పెట్టిన నాలుగు బెల్టు షాపులను బంద్ చెయ్యాలి' అంటూ జగ్గసాగర్ యువత పేరిట ఆదివారం పోస్టర్లు వెలిశాయి. దీంతో ఈ వ్యవహారం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

పట్టణాధ్యక్షుడిగా బండారి సదాశివకుమార్

సదాశివకుమార్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

మారుతీనగర్, సెప్టెంబర్ 22: పట్టణంలోని వాసవీమాతా ఆలయంలో ఆవోపా పట్టణాధ్యక్షుడిగా బండారి సదాశివకుమార్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు రాజేశుని శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. సదాశివకుమార్ ఎన్నిక పట్ల ఆర్యవైశ్య సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

జగిత్యాల టౌన్, సెప్టెంబరు 22: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రముఖ పండితుడు తిగుళ్ల విషు శర్మ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న దేవీ వైభవం ప్రవచనం కార్యక్రమానికి ఆదివారం ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి–లక్ష్మణ్, అర్చకులు వేణు, శ్రీనివాస్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సతీశ్‌కుమార్, నిర్వాహకులు మార లక్ష్మీనారాయణ, మార రాజేశం, మార కైలాసం, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, భక్తులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు

జగిత్యాల టౌన్, సెప్టెంబరు 22: పట్టణంలోని లోకమాత గాజుల పోచమ్మ ఆలయంలో భవానీ భక్త బృందం ఆధ్వర్యంలో రూపొందించిన దుర్గా శరన్నవరాత్రోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి–లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ముల్కస్తపు లలిత–మునీందర్, పద్మశాలీ సంఘం మాజీ అధ్యక్షుడు ఆకుబత్తిని శ్రీనివాస్, సాంబారి కళావతి, గదాసు రాజేందర్, గాజుల రాజేందర్, రాగిళ్ల నారాయణ, భవానీ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

తమ్ముడి మృతి తట్టుకోలేక ఆగిన అన్న శ్వాస..

- ఒకే రోజు వ్యవధిలో సోదరుల మృతి
- జగిత్యాల జిల్లా పాత గూడూరులో విషాదం



వెంకటయ్య (ఫైల్)

నర్సయ్య(ఫైల్)

వెల్గటూర్, సెప్టెంబర్ 22: తమ్ముడి మృతి తట్టుకోలేక ఓ అన్న శ్వాస ఆగిపోయింది. ఒక్క రోజు వ్యవధిలోనే ఇద్దరూ గుండెపోటుతో మృత్యువాత పడ్డారు. ఎండపల్లి మండలం పాతగూడూరులో విషాదం నింపిన ఈ ఘటనలకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పాత గూడూరుకు చెందిన రెడ్డి మల్ల నర్సయ్య(75) గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతూ కొద్ది రోజుల క్రితం బైపాస్ సర్జరీ చేయించుకున్నాడు. ఆ తర్వాత అతని ఆరోగ్యం మరింత క్షీణించగా 35 రోజుల నుంచి మృత్యువుతో పోరాడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. తమ్ముడి మరణ వార్త విన్న హైదరాబాద్‌లో ఉండే అతని అన్న రెడ్డిమల్ల వెంకటయ్య (78) హుటాహుటిన గ్రామానికి వచ్చాడు. ''నా కన్నా ముందే మమ్మల్ని వదిలి పోయావా తమ్ముడు'' అంటూ మృతదేహం వద్ద రోదించాడు. శనివారం దహన సంస్కారాలు పూర్తి చేసి కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చారు. తమ్ముడి మరణాన్ని జీర్ణించుకోలేక నిరంతరాయంగా రోదించిన వెంకటయ్య ''నా తమ్ముడు నన్ను రమ్మంటున్నాడు. నేను తమ్ముడి దగ్గరికి వెళ్తా'' అంటూ అని కుటుంబ సభ్యులకు చెప్పుకొంటూ కన్నీటి పర్యంతమయ్యాడు. ఆ తర్వాత నిద్రించిన ఆయన శనివారం రాత్రి మనోవేదనతో మృతిచెందాడు. తమ్ముడు మృతిచెందిన 24 గంటలు గడవకముందే అన్న చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యార్థికి అభినందన

జగిత్యాల టౌన్, సెప్టెంబరు 22: జిల్లా కేంద్రంలోని మానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ 9వ తరగతి విద్యార్థి శశిర్‌చంద్ర హైదరాబాద్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రజ్ఞా వికాస్ వ్యాసరచన పోటీలో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్‌తో పాటు రూ. 8వేల నగదు బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రజితరావు తెలిపారు. విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు డైరెక్టర్లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మౌనిక రావు అభినందించారు.

టీఎన్జీవోల ఉద్యోగుల యూనియన్ నూతన కమిటీ

కొత్తపల్లి, సెప్టెంబర్ 22 : వ్యవసాయ మార్కెట్ కమిటీ టీఎన్జీవో ఉద్యోగుల యూనియన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ప్రత్యేక ఆహ్వానితులుగా టీఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావులు హాజరు కాగా, ఎన్నికల పరిశీలకులుగా ఎం కిరణ్‌కుమార్, హర్మీందర్‌సింగ్‌లు వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా సయ్యద్ హమీద్ అలీ, గౌరవాధ్యక్షుడిగా సయ్యద్ సిరాజుద్దీన్, ఉపాధ్యక్షుడిగా టీ రాజశేఖర్, ఏ లక్ష్మణ్, ఏ వరలక్ష్మి, కార్యదర్శిగా పీ రమణ, సంయుక్త కార్యదర్శులుగా ఎన్ సురేందర్, కే సురేందర్, ముఖ్య సలహాదారుడిగా ఎన్ మనోహర్, సలహాదారుడిగా కే భూమన్న, కోశాధికారిగా ఎం శ్రావణ్‌కుమార్, ప్రచార కార్యదర్శి పీ హరినాథ్, నిర్వహణ కార్యదర్శిగా సీహెచ్ ప్రేమ్‌కుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా పీ శ్రీదేవి, సభ్యులుగా ఇంద్రసేనారెడ్డి, వెంకటనర్సయ్య, రాజేశం, సువర్ణ, సాబీర్‌బాబా, మధుసూదన్, మణెమ్మ ఎన్నికయ్యారు.

సొసైటీలను ప్రక్షాళన చేయాలి

తిమ్మాపూర్, సెప్టెంబర్ 22 : రాష్ట్రంలోని అన్ని గురుకులాల సొసైటీలను ప్రక్షాళన చేసి, ఏకరూప పని విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రౌతు అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని వాగేశ్వరీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మైనార్టీ విభాగం ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా కార్యవర్గాన్ని నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా జితేందర్, ప్రధాన కార్యదర్శిగా స్వప్న, ఉపాధ్యక్షులుగా వెంకటయ్య, జ్యోతి, సలహాదారుడిగా శ్రీధర్ నియామకమయ్యారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా సంపత్, సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు.

28న సైన్స్ డ్రామా ఫెస్టివల్‌కు విద్యార్థుల ఎంపిక

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 22: బెంగళూర్‌లోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నికల్ మ్యూజియం వారి ఆధ్వర్యంలో నవంబర్‌లో జరిగే దక్షిణ భారత సైన్స్ డ్రామా ఫెస్టివల్‌కు ఈనెల 28న జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు విద్యాశాఖ జారీ చేసిన గూగుల్ ఫారం ఈ నెల 26లోగా నింపి, పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

సీపీఎం నాయకుల సమావేశం

జగిత్యాల టౌన్, సెప్టెంబరు 22: జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కన్వీనర్ తిరుపతినాయక్ అధ్యక్షతన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పక్షోత్సవాల సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర నాయకుడు పుప్పాల శ్రీకాంత్ హాజరై మాట్లాడారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఇందూరి సులోచన, కోమటి చంద్రశేఖర్, వెంకటాచారి, రమేశ్, సిరికొండ చంద్రయ్య, శంకర్, మల్యాల సురేశ్, బొర్ర శేఖర్, రఫిక్, సులేమాన్, రజిత, రాదాపూజ, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

జగిత్యాల రూరల్ : నగదు అందజేస్తున్న బాలపెల్లి గ్రామ యువకులు

జగిత్యాల రూరల్, సెప్టెంబర్ 22: మండలంలోని బాలపెల్లి గ్రామానికి చెందిన ఎగుర్ల మల్లమ్మ ఇటీవల మృతి చెందింది. గ్రామస్తులు రూ. 30,500 సేకరించి ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు.

కొడిమ్యాల, సెప్టెంబర్ 22: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన కంకణాల శ్రీకాంత్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కొడిమ్యాల హెడ్ కానిస్టేబుల్ పొత్తెం రాజయ్య ఆదివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, రూ. 2116 అందజేశారు.

త్రిశక్తి ఆలయంలో భవానీ దీక్ష మాలధారణ

భవానీ దీక్ష స్వీకరించిన భక్తులు

మారుతీనగర్, సెప్టెంబర్ 22: పట్టణంలోని త్రిశక్తి ఆలయంలో అధ్యక్షుడు ద్యావనపల్లి రాజారాం ఆధ్వర్యంలో భవానీ దీక్ష మాలధారణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు విధుమౌళి శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకార్చనలు చేసి 41 రోజుల భవానీ దీక్షను ఆలయ అధ్యక్షుడితో పాటు 14 మంది దీక్షాపరులకు మాలధారణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బేతు భాస్కర్, ద్యావనపెల్లి గణేశ్, వాసాల నరేశ్, కార్తీక్, సతీశ్, దుర్గాప్రసాద్, హర్మిత్, హరీశ్, మణిదీప్, తనుశ్, శైలేందర్, నవీన్, అభి పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయరూ..

దేవికొండ-ల్యాగలమర్రి మధ్య తవ్విన రోడ్డు

పెగడపల్లి, సెప్టెంబర్ 22: పెగడపల్లి మండలం దేవికొండ–ల్యాగలమర్రి గ్రామాల మధ్య దేవికొండ చెరువు వద్ద వంతెన నిర్మాణం కోసం రోడ్డును తవ్వి వదిలి వేయడంతో రాకపోకలు నిలిచి పోయాయి. కేవలం ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్తుండగా, దేవికొండ, నంచర్ల, రాములపల్లి గ్రామాల ప్రజలు చొప్పదండి, కరీంనగర్ వెళ్లేందుకు, ల్యాగలమర్రి గ్రామస్తులు మండల కేంద్రానికి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాత్కాలికంగా పైపులు వేసి మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గుంతల పూడ్చివేత

గుంతలను సిమెంట్‌తో పూడ్చుతున్న యువకులు

మల్లాపూర్, సెప్టెంబర్ 22: మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో ఖానాపూర్–మెట్‌పల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద గుంతలు పడ్డాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన కొంత మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆదివారం గుంతలను పూడ్చివేశారు. యువకులను గ్రామస్తులు, వాహనదారులు అభినందించారు. కార్యక్రమంలో యువకులు శేఖర్, అర్జున్, కాశీరాం, రాజు, భాను, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో మున్సిపల్ అధికారుల తనిఖీలు

దుకాణదారుడికి జరిమాన రసీదు ఇస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల, సెప్టెంబర్ 22: పట్టణంలోని పలు కిరాణా దుకాణాలు, మటన్, చికెన్ సెంటర్లలో ఆదివారం మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న దుకాణదారులకు రూ. 2500 చొప్పున జరిమానా విధించారు. ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ మృతికి సంతాపం

జగిత్యాల టౌన్, సెప్టెంబరు 22: జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ బోగ అమృత రాజం (70) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షుడు ప్రకాశ్‌రావు, ఎండీ యాకూబ్, తదితరులు సంతాపం తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331774-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189